సాక్షి
నిజామాబాద్
మంగళవారం । 14 । ఫిబ్రవరి । 2023



ఫిర్యాదులను పరిష్కరించాలి

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు.

- 8లో ▸



ఎఫ్‌పీవోలకు సహకారం

రైతుల సర్వతోముఖాభివృద్ధికి ఎఫ్‌పీవో కృషి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్ సూచించారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.4 /16.8

పొగ మంచు కురుస్తుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

అదనపు జిల్లా జడ్జిగా శ్రీనివాస్



ఖలీల్‌వాడి: నిజామాబాద్ రెండో అదనపు జిల్లా జడ్జిగా తూముకుంట శ్రీనివాస్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ అంబర్‌పేటకు చెందిన ఆయన 2005లో లా పట్టభద్రులై బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకుని హైదరాబాద్, సికింద్రాబాద్ కోర్టులలో ప్రాక్టీస్ చేశారు. అనంతరం డైరెక్టర్ ఆఫ్ ప్రాసికూషన్ నిర్వహించిన అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పరీక్షల్లో ఉత్తీర్ణుడై ఎన్నికయ్యారు. ఏపీపీగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే రాష్ట్ర హైకోర్టు నోటిఫికేషన్ ప్రకారం అదనపు జిల్లా జడ్జి పదవికి దరఖాస్తు చేసుకుని, హైకోర్టు నిర్వహించిన అన్ని పరీక్షల్లో ఎంపికయ్యారు. ప్రథమంగా నిజామాబాద్ రెండో అదనపు జిల్లా జడ్జిగా నియామాకం అయ్యారు.

ప్రాక్టికల్స్ నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి



నిజామాబాద్‌అర్బన్: ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణలో చీఫ్ సూపరింటెండెంట్లు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి రఘురాజ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో చీఫ్ సూపరింటెండెంట్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాక్టికల్స్ ఈ నెల 15వ తేదీ నుంచి మార్చి రెండో తేదీ వరకు కొనసాగనున్నాయని తెలిపారు. ప్రాక్టికల్స్ నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సమావేశంలో నిజామాబాద్ పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు రవికుమార్, చిన్నయ్య, కనకమహాలక్ష్మి, ప్రిన్సిపాల్‌ల సంఘం అధ్యక్షుడు చిరంజీవి, బాలుర కళాశాల ప్రిన్సిపాల్ య కీనుద్దీన్, లెక్చరర్ల సంఘం అధ్యక్షుడు న ర్సయ్య పాల్గొన్నారు.

ఐటీఐ పరిసరాల్లో చెత్త తొలగింపు



సాక్షి ఎఫెక్ట్..

నిజామాబాద్‌నాగారం: 'సాక్షి' దినపత్రికలో సోమవారం ప్రచురితమైన 'గాడి తప్పుతున్న శానిటేషన్' కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. శానిటేషన్ విషయంలో ఏం జరిగిందన్న కోణంలో శాఖలో అధికారులు ఇప్పటికే విచారిస్తున్నట్లు తెలిసింది. అలాగే బాలికల ఐటీఐ ఆవరణలో మురుగునీరు, చెత్త నిండుకొని అధ్వానంగా ఉన్న ఫొటో ప్రచురితం కాడంతో శానిటేషన్ అధికారులు స్పందించారు. ఆవరణలోని చెత్తను తొలగించడంతో పాటు మురికి కాల్వలను శుభ్రం చేయించారు.

కొడుకులు తిండి పెట్టడం లేదు



కొడుకులు తిండి పెట్టడం లేదని, పైగా తమ వద్ద ఉన్న డబ్బులను లాక్కుంటున్నారని వృద్ధ దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని నర్సాగౌడ్‌వీధికి చెందిన న్యామతాబాద్ గంగాజీ, లక్ష్మీబాయి దంపతులు సోమవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతును కలిశారు. తమకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారని, వారికి పెళ్లిళ్లు అయిపోయాయన్నారు. కొడుకులు తమకు తిండిపెట్టడం లేదని, ఇంటి అద్దె డబ్బులతో బతుకు వెళ్లదీస్తున్నామని చెప్పారు. అయితే ఆ డబ్బులను కూడా లాక్కొంటున్నారని వాపోయారు. తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. స్పందించిన కలెక్టర్ ఈ విషయమై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

అవగాహనే ముఖ్యం

- ప్రేమ పెళ్లయినా.. పెద్దలు కుదిర్చిన వివాహమైనా అన్యోన్యత అవసరం
- అప్పుడే వైవాహిక జీవితం ఆనందమయం
- వాలంటైన్స్ డే సందర్భంగా 'సాక్షి టాక్ షో'లో మెడికోల మనోగతం







ప్రేమ వివాహమైనా, పెద్దలు కుదిర్చిన పెళ్లయినా.. ఇరువురి మధ్య అవగాహన ఎంతో ముఖ్యమని.. అప్పుడే జీవితం ఆనందమయంగా ఉంటుందని వైద్య విద్యార్థులు పేర్కొన్నారు. కొందరు ప్రేమ వివాహాలపై ఆసక్తి చూపగా, మరి కొందరు పెద్దలు కుదిర్చిన పెళ్లిళ్లే సరైనవన్నారు. ఏ వివాహం చేసుకున్నా.. ఒకరిపై ఒకరికి మంచి అవగాహన కలిగి ఉండాలని, అదే అందమైన దాంపత్యానికి బాట వేస్తుందన్నారు. వాలంటైన్స్ డేను పురస్కరించుకుని 'సాక్షి' ఆధ్వర్యంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ప్రేమ పెళ్లి, పెద్దలు కుదిర్చిన పెళ్లి అనే అంశంపై సోమవారం నిర్వహించిన టాక్‌షోలో మెడికోలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

–నిజామాబాద్ సిటీ/నిజామాబాద్ అర్బన్

గౌరవించుకోవాలి



వివాహానంతరం ఒకరి అభిప్రాయాలను మరొకరు గౌరవించుకోవాలి. దీనివల్ల ఇద్దరి మధ్య భేదాభిప్రాయాలు ఉండవు. అవగాహన పెరుగుతుంది. ప్రేమగా జీవితాన్ని కొనసాగిస్తారు. నేను అనే భావన సరి కాదు. ప్రేమ వివాహమైనా, కుదిర్చిన వివాహం అయినా ఇలాగే కొనసాగాలి. – హర్షిత

ప్రేమ ఆప్యాయతలే ముఖ్యం



ఇటీవల కాలంలో భార్యభర్తల మధ్య భేదాభిప్రాయాలు ఏర్పడి విడాకుల సంఖ్య పెరుగుతోంది. ఇలా కాకుండా ఒక అవగాహన ఉండాలి. దీని వల్ల మంచి జీవితాన్ని పొందుతారు. ప్రేమ ఆప్యాయతలు ఉంటే దాంపత్యం సాఫీగా సాగుతుంది. కొందరు అవగాహన రాహిత్యంతో తక్కువ వయస్సులో తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాలు వారి జీవితానికే ఇబ్బందికరంగా మారుతున్నాయి. ఇలా కాకుండా అవగాహన కలిగి ఉంటే మంచిది. – ఇందిర, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్

జీవితంలో స్థిరపడ్డాకే ప్రేమ

యువత ముందు తమ కేరీర్‌పై దృష్టిపెట్టాలి. జీవితంలో స్థిరపడ్డాక ప్రేమించుకోవడం ఎంతో ఉత్తమం. ప్రేమ వివాహం చేసుకోవాలంటే మొదట తల్లిదండ్రులను ఒప్పించాకే పెళ్లి చేసుకోవాలి. ప్రాశ్చత్య దేశాల్లో ప్రేమికుల రోజు సంస్కృతి మనదేశంలోకి వచ్చింది. దీనిని ప్రత్యేకంగా నిర్వహించుకుంటున్నారు. ప్రేమికులు, భార్యభర్తలే కాకుండా ఓ కుటుంబ మొత్తం ఒకరిపై ఒకరు మంచి అవగాహన కలిగి ఉంటే ఆ కుటుంబంలో ప్రేమ లభిస్తుంది. తల్లిదండ్రులు చూపే ప్రేమను గౌరవించుకోవాలి. – ప్రతిమారాజ్, జీజీహెచ్ సూపరింటెండెంట్

పెళ్లి ఏదైనా ఒక్కటే..

ప్రేమ వివాహమైనా.. పెద్దలు కుదిర్చిన పెళ్లయినా ఒకేలా ఉంటుంది. ఇద్దరి మధ్య అవగాహన, ప్రేమ కలిగి ఉండాలి. ఈ రెండు లేకుంటే ఎలాంటి వివాహం అయినా నిలవదు. వాలెంటైన్స్ డే లాంటి ప్రత్యేక రోజు వ్యర్థమే. ప్రేమ ఉంటే ప్రతిరోజూ ప్రత్యేకమే. – సాయి సంవేద, వైద్య విద్యార్థి

తల్లిదండ్రుల ప్రేమే నిదర్శనం



ప్రేమ విషయంలో నా తల్లిదండ్రులే నాకు నిదర్శనం. 20 ఏళ్ల కు పైగా వారు ఎంతో అన్యోన్యంగా ఉంటున్నారు. వారి ప్రేమానురాగాలు వారి మధ్య ఉన్న అవగాహనకు కారణం. ఏ వివాహం చేసుకున్నా.. ఇద్దరి మధ్య అవగాహన కలిగి ఉండాలి. భార్యభర్తల మధ్య భవిష్యత్ ప్రణాళిక ఉండాలి. ఒకరినొకరు గౌరవంగా ఉండాలి. – విజయ్ సాయిరాంకృష్ణ

-మరిన్ని అభిప్రాయాలు 8లో..

ఆదర్శంగా ఉండాలి



నిజామాబాద్‌నాగారం: టీనేజీలో ప్రేమ అంటూ తిరుగుతూ జీవితాన్ని నాశనం చేసుకోవద్దు. ప్రేమించుకోవడం తప్పుకాదు. జీవితంలో సెటిల్ అయిన తర్వాత ప్రేమించి పెళ్లి చేసుకుంటే భవిష్యత్తు బాగుంటుంది. తెలిసీతెలియని వయస్సులో కలిగేది కేవలం ఆకర్షణ మాత్రమే. ఇదే ఆకర్షణను విద్యార్థులు, యువతీయువకులు ప్రేమ అనుకొని తప్పటడుగులు వేస్తున్నారు. ప్రేమించలేదని దాడులు చేయడం సరికాదు. బాగా చదువుకొని జీవితంలో బాగుపడిన తర్వాతే ప్రేమ గురించి ఆలోచించాలి. నీ కాళ్ల మీద నిలబడ్డ తర్వాత ప్రేమిస్తే ఇరు కుటుంబాలు సైతం ఒప్పుకొని దగ్గరుండి పెళ్లిలు చేయిస్తారు. తద్వారా మీరే కాకుండా కుటుంబ, సభ్యులు, బంధుమిత్రులు అందరితో సంతోషంగా కలిసి ఉండవచ్చు. మీ ప్రేమ ఎదుట వారిలో చులకనగా కాకుండా బాధ్యతతో పదిమందికి ఆదర్శంగా ఉండేలా జీవించాలి. – కేఆర్ నాగరాజు, సీపీ

పెద్దలు కాదన్నా..



సుధాకర్ కుటుంబం

మాక్లూర్: కులం కట్టుబాట్లు, సంప్రదాయాల అడ్డుగోడలు దాటుకుని పదేళ్ల క్రితం పెద్దలు అంగీకరించకపోయి నా ప్రేమ వివాహం చేసుకున్నారు. అన్యోన్యంగా దాంపత్య జీవితాన్ని గడుపుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు సుధాకర్, ప్రగతి దంపతులు. ప్రస్తుతం వీరికి ఒక పాప, ఒక బాబు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ప్రత్యేకాధికారిణి సీహెచ్ ప్రగతి ఎంఎస్సీ, బీఈడీ, పీహెచ్‌డీ పూర్తి చేసింది. ఆమె చదువుకుంటూ సోషల్ వర్కర్‌గా పని చేస్తుండగా 2009లో నిజామాబాద్ మండలం కాలూర్‌కు చెందిన ఎం.సుధాకర్‌ను ప్రేమించింది. అప్పటికి ఆయన కూడా ఎంఏ, బీఈడీ, పీహెచ్‌డీ పూర్తిచేసి కమ్యూనిస్టు రాజకీయాల్లో బిజీగా ఉన్నారు. ఆ క్రమంలో ప్రేమలో పడిన వీరు నాలుగేళ్ల పాటు ప్రేమాయనం సాగించిన అనంతరం వీరిద్దరు విషయాన్ని తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లారు. కులాలు వేరు కావడంతో వీరి ఇద్దరి ప్రేమను కుటుంబ సభ్యులు అంగీకరించలేదు. దీంతో పెద్దలను ఎదిరించి మార్చి 3, 2013లో వివాహం చేసుకున్నారు. వీరికి కూతురు విముక్త, కుమారుడు క్రాంతి ఉన్నారు. ప్రగతి పోటీ పరీక్షలు రాసి ప్రభుత్వ ఉద్యోగం సాధించి ప్రస్తుతం మాక్లూర్ మండలం కేజీబీవీ బాలికల పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా కొనసాగుతున్నారు. ప్రేమ అంటే ఒకరిని ఒకరు అర్థం చేసుకుని బాధ్యతగా వ్యవహరించడమేనంటున్నారు.

నా కొడుకు నిర్ణయం సరైందే..



నా కొడుకు సుధాకర్ ఒక రోజు అమ్మా నేను ఓ అమ్మాయిని ప్రేమించానని, ఆమెనే పెళ్లి చేసుకుంటానని చెప్పాడు. నాకు ఒక్కసారిగా పిడుగు పడ్డట్లు అయ్యింది. రూ. లక్షలు ఖర్చుపెట్టి ఉన్నత చదువులు చదివించింది ఇందుకేనా అని తిట్టాను. వాడు వినకుండా మమ్మల్ని ఎదిరించి పెళ్లి చేసుకున్నాడు. నా కొడుకు నిర్ణయం సరైందేనని ఇప్పుడు అనిపిస్తోంది. వారు ఇద్దరు బిడ్డలతో అన్యోన్యంగా జీవిస్తున్నారు. అంతకన్నా మాకు ఇంకేం కావాలి. – ముస్కె లక్ష్మి, సుధాకర్ తల్లి

కెరీర్ తర్వాతే ప్రేమ, పెళ్లి



నిజామాబాద్ సిటీ : నేటి ఆధునిక కాలంలో 'ప్రేమ' అనే పదాన్ని యుక్తవయస్కులు సరిగ్గా అర్థం చేసుకోలేకపోతున్నారు. మారుతున్న హైటెక్ వేషధారణలు, అనుకరణలు, చేతిలో ప్రపంచాన్నీ చూపే స్మార్ట్ ఫోన్లు. సెక్స్ హార్మోన్ల ప్రభావం, తల్లిదండ్రుల అతి ప్రేమలు, కట్టుబాట్లు, కుటుంబంలో ప్రేమకు నిరాదరణకు గురి కావడం, సెలబ్రిటీల ప్రవర్తనలు, అలాగే ఎగిరి గంతులేసే మానసిక స్థితుల్లో ఉన్న యువత తాత్కాలిక సుఖాల వ్యామోహంలో కొట్టుకుపోతున్నారు. అలాంటి చాలా మంది టీనేజర్లు సోషల్ మీడియాలో రెండు లేదా మూడు నెలలు ఒకరితో ఒకరు అర్ధరాత్రి సంభాషణలు చేసుకుని అదే ప్రేమ అని నమ్మి భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారు. ప్రేమించడం లేదా ప్రేమించబడడం సులువు కావొచ్చేమో కానీ మంచి కెరీర్‌ని నిర్మించుకోవడం చాలా కష్టం. అందమైన భవిష్యత్తును అందమైన అమ్మాయి లేదా, అబ్బాయి ఇవ్వలేరు. కానీ అందమైన కెరీర్ ఉంటే మాత్రం అందమైన అమ్మాయి లేదా అబ్బాయి సులువుగా నీ సొంతం కావొచ్చు. అందుకే కెరీర్ తర్వాతనే ప్రేమలు, పెళ్లిళ్ల గురించి ఆలోచించండి తప్ప ఆకర్షణలకు మోసపోతే భవిష్యత్తులో మనుగడ కష్టమే సుమా!

– డాక్టర్ బి కేశవులు, ఎండీ సీనియర్ మానసిక వైద్య నిపుణులు

పని చేయకున్నా.. జీతాలు

- విధులకు పర్మినెంట్ సీనియర్ కార్మికుల డుమ్మా
- వేతనాలు సుమారు రూ. 70 వేల పైనే..
- వారి స్థానంలో సొంతంగా నియమించుకున్న కార్మికులు
- నగర పాలక సంస్థ శానిటేషన్ విభాగంలో ఏళ్లుగా తంతు
- 24 మందికి వాలంటరీ రిటైర్మెంట్ పెడితే ఐదుగురికే అనుమతి



నిజామాబాద్ నాగారం : మున్సిపల్ కార్మికులంటే నే ఎవరైనా గౌరవం ఇవ్వాల్సిందే.. పారిశుధ్య నిర్వహణలో వారి సేవలు అనన్యం.. ప్రతినిత్యం నగరం పరిశుభ్రంగా ఉండాలంటే కార్మికులు ముందుకు కదాల్సిందే.. అయితే శానిటేషన్ విభాగంలో అధికారుల తీరుతో అర్హులైన కార్మికులకు అన్యాయం జరుగుతోంది. నగరం పాలక సంస్థకు నష్టం కలుగుతోంది. వయోభారం, అనారోగ్యం కారణంగా పనిచేయలేని స్థితిలో ఉన్న సీనియర్ కార్మికులు కొంతమంది అనధికారికంగా తమవంతుగా మరొకరిని విధుల్లోకి పంపుతున్నారు. తాము పెద్దమొత్తంలో జీతాలు పొందుతూ సొంతంగా నియమించుకున్న వారికి కొద్దిపాటి డబ్బులు ఇస్తున్నారు. ఇటువంటి సీనియర్ కార్మికులను తొలగించాల్సి ఉన్నా అధికారులు తొలగించడం లేదు. విధులకు హాజరు కాని వారికి హాజరు వేస్తున్నారు. ఇందుకు ప్రతిఫలంగా కమీషన్లు పొందుతున్నారు.

ఇన్‌చార్జి కమిషనర్ ప్రతిపాదించినా..

శానిటేషన్ విభాగంలో అనారోగ్యంతో విధులకు హాజరు కాలేకపోతున్న కార్మికులను, వారిస్థానంలో అనధికారికంగా విధులు నిర్వహిస్తున్న వారిని ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ గుర్తించారు. 24 మంది పారిశుధ్య కార్మికులకు వాలంటరీ రిటైర్‌మెంట్‌కు అనుమతి ఇస్తూ, వారి కుటుంబంలో నుంచి ఒకరికి ఉద్యోగం కల్పించాలని కలెక్టర్‌కు ప్రతిపాదన పంపించారు. అయితే ఐదుగురికి మాత్రమే రిటైర్మెంట్‌కు అనుమతి లభించింది. మిగతా వారికి అమలు కాకుండా కొంతమంది అధికారులు అడ్డుపడ్డారు. ఎందుకంటే సీనియర్ పర్మెనెంట్ కార్మికులకు వేతనం నెలకు రూ.70 వేలపైనే వస్తుంది. వాలంటీర్ రిటైర్మెంట్ తీసుకుంటే పెన్షన్ తక్కువ వస్తుంది.

బదిలీ వర్కర్లు ఇలా..

సీనియర్ కార్మికులు తమ వంతుగా విధులకు పంపించే బదిలీ కార్మికులకు సొంతంగా నెలకు రూ. 6 వేల నుంచి రూ. 8 వేల వరకు జీతాలు ఇస్తున్నారు. ఈ వర్కర్లకు పీఎఫ్, ఈఎస్‌ఐ ఉండదు. జీతాలు కూడా కార్పొరేషన్‌కు సంబంధం ఉండదు. ఏదైనా జరగకూడదని నష్టం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు. బదిలీవర్కర్లు విధులు నిర్వహిస్తున్న విషయం ప్రతి జోన్‌లో ఉండే శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు తెలిసినా మౌనం పాటిస్తున్నారు.ఎందుకంటే వారి మామూళ్లు వారికొచ్చేస్తాయని ఆరోపణలున్నాయి.

డుమ్మా కొడుతున్నా..

శానిటేషన్ పరిధిలో సుమారుగా 1250 మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో రెగ్యులర్‌గా 60 మందిలోపు ఉంటే, మిగతా వారు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నారు. నగరంలో మొత్తం ఆరు జోన్ కార్యాలయాలున్నాయి. ప్రతిజోన్‌లో సుమారు 20 మందికిపైగా కార్మికులు డుమ్మా కొడుతున్నారు. అయినా వీరికి జీతాలు వస్తున్నాయని మిగతా కార్మికులు బహిరంగంగా చెప్పుకుంటున్నారు. డుమ్మా కొట్టిన కార్మికులకు ఫుల్ జీతాలు వచ్చేలా కొంతమంది అధికారులు హాజరు వేయిస్తున్నారు. తద్వారా వారికి ప్రతిఫలం అందుతుంది. ఈ విషయం ఈ నెల 10న ప్రత్యేక అధికారులు నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో బయట పడింది.

'అంబులెన్స్‌లో వచ్చి.. సమస్యను విన్నవించి..'



విధి ఆడిన ఆటలో ఓ కుటుంబం రోడ్డున పడింది. ఆపన్నహస్తం అందించాలని బాధిత కుటుంబ సభ్యులు అంబులెన్స్‌లో సోమవారం కలెక్టర్ కార్యాలయానికి తరలివచ్చారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుతో తమ గోడును వెల్లబోసుకున్నారు. నగరంలోని దుబ్బకు చెందిన అల్వల పవన్ పేయింటింగ్ పనిచేస్తూ, కుటుంబాన్ని పోషించేవాడు. ఏడు నెలల క్రితం ఆనంద్‌నగర్‌లో ఓ భవనానికి పేయింటింగ్ చేస్తుండగా కింద పడ్డాడు. దీంతో పవన్ నడుముకు దెబ్బ తగలడంతో మంచానికే పరిమితమయ్యాడు. చికిత్స కోసం రూ. 5లక్షలు అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫిజియోథెరపి కోసమే నెలకు రూ. 15 వేలు ఖర్చవుతోందని బాధితుడు తెలిపాడు. కుటుంబ పోషణ భారమై.. ఇదేం బతుకు దేవుడా అంటూ కాలం వెల్లదీస్తున్నామని కన్నీటి పర్యంతమయ్యాడు. తనకు భార్య, ముగ్గురు సంతానం ఉన్నారని ప్రభుత్వం తమ కుటుంబాన్ని ఆదుకోవాలని వేడుకున్నాడు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

క్రీడలతో పోలీసులకు ఉపశమనం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ నాగరాజు

- 24 గంటలు విధులు నిర్వహించేది పోలీసులే
- శాంతి భద్రతల పరిరక్షణలో అధిక ఒత్తిడికి గురవుతారు
- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- వార్షిక స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

నిజామాబాద్‌నాగారం: శాంతిభద్రతల పరిరక్షణ నేపథ్యంలో 24 గంటల పాటు విధులు నిర్వహించేది కేవలం పోలీసులు మాత్రమేనని.. ప్రతినిత్యం ఒత్తిడికి గురవుతారని.. క్రీడలు ఆడడం ద్వారా మానసికోల్లాసం కలుగుతుందని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంత్ అన్నారు. సోమవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వార్షిక స్పోర్ట్స్ మీట్‌ను నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, సీపీ నాగరాజు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రం ప్రశాంతంగా ఉండడానికి పోలీసులే కారణమన్నారు. ఇతర శాఖల వారికి అన్ని సెలవు దినాలు ఉంటాయని, పండుగలు ఉంటాయని, పోలీస్ సిబ్బందికి ఎలాంటి సెలవులు, పండుగలు ఉండవన్నారు. విధినిర్వహణలో ఒత్తిడికి గురవుతున్న పోలీసులకు ఈ వార్షిక స్పోర్ట్స్ మీట్ ఉత్సాహంతో పాటు ఉల్లాసాన్ని కలిగిస్తుందన్నారు. క్రీడల వల్ల వ్యక్తుల మధ్య చక్కని బంధం ఏర్పడుతుందన్నారు. సీపీ నాగరాజు మాట్లాడుతూ కొన్నేళ్లుగా కోవిడ్ వల్ల క్రీడలు నిర్వహించలేదని, మళ్లీ సాధారణ వాతావరణం ఏర్పడడంతో క్రీడలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏసీపీలు గిరిరాజు, కిరణ్ కుమార్, ప్రభాకర్‌రావు, నారాయణ, సంతోష్ కుమార్, శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు వాయిదా

ఈనెల 15న కొండగట్టుకు సీఎం కేసీఆర్ వస్తున్న నేపథ్యంలో జిల్లా నుంచి సుమారు 70 శాతం పోలీసులు బందోబస్తుకు వెళ్తున్నారు. ఈ సందర్భంగా పోలీసులకు నిర్వహించే క్రీడలు తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు సీపీ నాగరాజు వెల్లడించారు. క్రీడా పోటీలు ప్రారంభమైనప్పటికీ సీఎం బందోబస్తు దృష్ట్యా పోటీలను తాత్కాలికంగా నిలిపివేశారు. జిల్లా నుంచి బందోబస్తుకు 10 మంది సీఐలు, సుమారు 40 వరకు ఎస్సైలు, కానిస్టేబుళ్లు వెళ్తున్నట్లు సమాచారం.



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

క్లుప్తంగా

డిగ్రీ పరీక్షల్లో ముగ్గురు డిబార్‌

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో సోమవారం జరిగిన డిగ్రీ మొదటి సెమిస్టర్‌ రెగ్యులర్‌ పరీక్షల్లో ముగ్గురు విద్యార్థులు డిబార్‌ అయినట్లు కంట్రోలర్‌ ఎం అరుణ తెలిపారు. నిజామాబాద్‌లోని సీఎస్‌ఐ డిగ్రీ కాలేజీ కేంద్రంలో ఇద్దరు విద్యార్థులు, శ్రీవిశ్వశాంతి డిగ్రీ కాలేజీ పరీక్షా కేంద్రంలో మరొక విద్యార్థి మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతూ డిబార్‌ అయినట్లు కంట్రోలర్‌ తెలిపారు.

24 నుంచి పీజీ సెమిస్టర్‌ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని పీజీ సెమిస్టర్‌ పరీక్షలు ఈ నెల 24 నుంచి ప్రారంభమవుతాయని కంట్రోలర్‌ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంసీఏ, ఎంబీఏ మొదటి, మూడో సెమిస్టర్‌, ఎల్‌ఎల్‌ ఎం మూడో సెమిస్టర్‌, ఎల్‌ఎల్‌బీ మూడో, ఐ దో సెమిస్టర్‌, ఐఎంబీఏ ఏడో, తొమ్మిదో సెమిస్టర్‌ రెగ్యులర్‌ పరీక్షలు జరుగుతాయన్నారు.

16 నుంచి బీఈడీ ప్రాక్టికల్స్‌..

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ మూడో సెమిస్టర్‌ (ఈపీసీ–3, ఈపీసీ–4) ఫేజ్‌–1 ప్రాక్టికల్‌ పరీక్షలు ఈ నెల 16, 17వ తేదీల్లో నిర్వహించనున్నట్లు కంట్రోలర్‌ అరుణ తెలిపారు. అలాగే ఈ నెల 20, 21వ తేదీల్లో ఫేజ్‌ –2 ప్రాక్టికల్‌ పరీక్షలు జరుగుతాయన్నారు.

తెయూ ఇంటర్‌ కాలేజీ క్రికెట్‌ టోర్నీ ప్రారంభం



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఇంటర్‌ కాలేజీ క్రికెట్‌ (మెన్‌) టోర్నమెంట్‌ సోమవారం క్యాంపస్‌ క్రీడా మైదానంలో ప్రారంభమైంది. స్పోర్ట్స్‌ అండ్‌ గేమ్స్‌ డైరెక్టర్‌ సంపత్‌కుమార్‌ క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఇంటర్‌ కాలేజీ క్రికెట్‌ టోర్నీ నిర్వహించడం ఇదే మొదటిసారి అన్నారు. టోర్నమెంట్‌ మూడు రోజుల పాటు కొనసాగుతుందన్నారు. సోమవారం తొలి రోజు వివిధ కళాశాలల నుంచి వచ్చిన 8 జట్లు పోటీ పడ్డాయి.

మొదటి రోజు విజేతలు

మొదటి మ్యాచ్‌ కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, యూనివర్సిటీ కళాశాల (సౌత్‌క్యాంపస్‌) జట్ల మధ్య జరిగింది. ఇందులో యూనివర్సిటీ కళాశాల గెలుపొందింది. కామారెడ్డి ట్రైబల్‌ వెల్ఫేర్‌ డిగ్రీ కళాశాల, యూనివర్సిటీ ఎడ్యుకేషన్‌ కళాశాల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో ట్రైబల్‌ వెల్ఫేర్‌ జట్టు విజేతగా నిలిచింది. మూడో మ్యాచ్‌లో నిజామాబాద్‌ గిరిరాజ్‌ కళాశాల, యూనివర్సిటీ డిగ్రీ జట్లు తలపడగా గిరిరాజ్‌ కాలేజీ గెలిచింది. పీజేఆర్‌ స్ఫూర్తి డిగ్రీ, పీజీ కళాశాల, యూనివర్సిటీ కళాశాల (సౌత్‌క్యాంపస్‌) మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో యూనివర్సిటీ కళాశాల జట్టు విజయం సాధించింది. ఈ టోర్నీమెంట్‌ ఆర్గనైజింగ్‌ సెక్రటరీగా బీఆర్‌నేత వ్యవహరించగా, వివిధ అనుబంధ కళాశాలల ఫిజికల్‌ డైరెక్టర్లు బాలమణి, శ్రీధర్‌గౌడ్‌, అనిల్‌ కుమార్‌ పాల్గొన్నారు.

ఎప్పుడూ ప్రేమించాలి

నిజామాబాద్‌సిటీ/నిజామాబాద్‌అర్బన్‌: ప్రేమ ఎంతో మధురమైంది.. ప్రేమతోనే జీవిత ప్రయాణం సాఫీగా సాగుతుంది. వాలంటైన్స్‌ డే సందర్భంగా ప్రభుత్వ వైద్య కళాశాలలో నిర్వహించిన సాక్షి టాక్‌ షోలో మెడికోలు తమ అభిప్రాయాలు పంచుకున్నారు.

సాక్షి టాక్‌ షో Valentine's Day



సాక్షి టాక్‌ షోలో పాల్గొన్న విద్యార్థులు

అహాన్ని వీడాలి



వాలంటైన్స్‌ డే రోజునే కాకుండా ఎప్పుడూ ప్రేమించాలి. కలిసి ఉన్నన్నాళ్లు ఇగోను వదిలి అవగాహనతో ఉండాలి. అప్పుడే భేదాభిప్రాయాలు రావు. స్పెషల్‌ డే నాడే ప్రేమించి మిగతా రోజుల్లో సాధారణమే అనడం సరికాదు. తల్లిదండ్రులను గౌరవంగా చూసుకుంటే ఎంతో ప్రేమ దొరుకుతుంది. – కౌశిక్‌

వాలంటైన్స్‌ డే ప్రత్యేకమే



ప్రేమను వెలిబుచ్చేందుకు, ప్రేమికులను మరింత ప్రేమించేందుకు వాలంటైన్స్‌ డే ప్రత్యేకమే. ప్రత్యేకరోజు వల్ల కొందరిలో ప్రత్యేకమైన ప్రేమ వెల్లువిరిస్తుంది. కొందరి మనస్సులు కూడా కలుస్తాయి. ప్రత్యేకమైన రోజును ఆస్వాదించాల్సిందే. – భూక్యా రవికుమార్‌

వ్యక్తిని చూసి ప్రేమించడం కాదు



వ్యక్తిని చూసి ప్రేమించడం కాదు.. వ్యక్తిత్వం తెలుసుకోవాలి. ప్రేమగా ఉండే వ్యక్తిని గుర్తించాలి అప్పుడే ఇద్దరి మధ్య సరైన ప్రేమ చిగురిస్తుంది. వాలంటైన్స్‌ డే ప్రత్యేకంగా కాకుండా ప్రేమగా ఉండేందుకు ఏ రోజు అయిన పర్వాలేదు. – లహరి

ఒడిదుడుకులు ఉంటాయి



ప్రేమ పెళ్లి లేదా పెద్దలు కుదిర్చిన వివాహం అయినా జీవితంలో ఒడిదుడుకులు అనేవి సహజమే. ఇద్దరి మధ్య మంచి అవగాహన ఉంటే ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉంటాయి. ఒకరిని ఒకరు అర్థం చేసుకొని ఉండాలి. – నవ్యశ్రీ

పెద్దలు కుదిర్చిన వివాహమే బాగుంటుంది



ప్రస్తుత రోజుల్లో పెద్దలు కుదిర్చిన వివాహాలే బాగుంటాయి. తల్లిదండ్రులకు ఎదుటి వ్యక్తులపై అవగాహన కలిగి ఉండటం, వ్యక్తిత్వం తెలుసుకోవటం బాగా తెలుసు. దీంతో సరైన వ్యక్తిని పొందగలుగుతాం. తద్వారా మంచి కుటుంబం లభిస్తుంది. – బబితా యాదవ్‌

అర్థం చేసుకోవచ్చు..



ప్రస్తుతం భర్తలు భార్యలపై పెత్తనం చెలాయిస్తున్నారు. పెద్దలు కుదిర్చిన పెళ్లిలో ఇవి ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. ఇలా కాకుండా ప్రేమించి పెళ్లి చేసుకోవటంతో ముందే అర్థం చేసుకునే అవకాశం ఉంటుంది. దీంతో వివాహం తర్వాత కూడా సంతోషంగా ఉండగలుగుతారు. భర్త భార్య అనే బంధం కాకుండా ప్రేమికులుగానే ఉంటారు. ఇద్దరి మధ్య ఎలాంటి గొడవలు, ఇబ్బందులు తలెత్తవు. – హరిచందన

సంబంధాలను గౌరవించడమే నిజమైన ప్రేమ



నేటి తరానికి పెద్దలు కుదిర్చిన పెళ్లి సంబంధాలంటే లోకువ. అందులో ప్రేమ ఉండదని వారి నమ్మకం. కానీ చరిత్రను చూస్తే పెద్దలు కుదిర్చిన సంబంధాలే ఎక్కువ శాతం ప్రేమ అనురాగాలతో దాంపత్య జీవితం విజయవంతం అవుతుందని తెలుస్తోంది. నిత్య జీవితంలో ప్రతి సంబంధ బాంధవ్యాలకు తగిన గౌరవం ఇస్తూ జీవితం కొనసాగించే దంపతులకు ప్రతిరోజూ ప్రేమికుల రోజే. – రాజేశ్‌, డిగ్రీ కళాశాల అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌, ఆర్మూర్‌

ప్రేమ ఉన్నత విలువలతో కూడినది



నిజమైన ప్రేమ అనేది కేవలం భౌతిక సౌందర్యాన్ని చూడకుండా వ్యక్తి అంతః సౌందర్యంతో ముడిపడి ఉంటుంది. అలాంటి ప్రేమ శాశ్వతమైనది, ఉన్నత ఆశయాలతో కూడుకున్నది. ఒకరినొకరు ప్రేమించుకొని ఆదర్శంగా నిలవాలి. ప్రేమ విలువ వెలకట్టలేనిది. – నాగరాజు, ఆర్మూర్‌ ఆస్పత్రి సూపరింటెండెంట్‌

మనసులు కలిసి..

బోధన్‌: ప్రేమించి పెళ్లి చేసుకుని అన్యోన్యంగా ఉంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు ఈ యువ దంపతులు. కుల అంతరాలు, కుటుంబ సభ్యుల అభ్యంతరాలను ఎదుర్కొని పెళ్లి చేసుకున్నారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలంలోని వెల్లుల్లా గ్రామానికి చెందిన సంపత్‌ (23), నవ్య (22) వేర్వేరు కులాలకు చెందిన వారు. సొంత ఊరులో చిన్న వయస్సు నుంచే ఇరువురికి పరిచయం ఉంది. ఈ క్రమంలో మనసులు కలిసి ప్రేమలో పడి పెళ్లి చేసుకుందామని నిర్ణయానికొచ్చారు. ఇరువురు వారి కుటుంబ సభ్యులకు తెలిపారు. నవ్య తల్లిదండ్రులు పెళ్లికి అంగీకరించలేదు. దీంతో 2021లో సొంత ఊరు నుంచి బోధన్‌ ప్రాంతానికి వచ్చి ఓ ఆలయంలో పెళ్లి చేసుకుని ఇక్కడే స్థిరపడ్డారు. యువ దంపతులకు మూడు నెలల బాబు ఉన్నాడు. సంపత్‌ వృత్తి రీత్యా మోటార్‌ బైక్‌ మెకానిక్‌. బోధన్‌లో బైక్‌ మెకానిక్‌ దుకాణం ఏర్పాటు చేసు కుని స్వయం ఉపాధి పొందుతున్నాడు.



సీఎస్‌ను కలిసిన జెడ్పీ చైర్మన్‌



నిజామాబాద్‌నాగారం: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారిని జిల్లా పరిషత్‌ చైర్మన్‌ దాదాన్నగారి విఠల్‌రావు సోమవారం హైద్రాబాద్‌లోని మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

15, 16 తేదీల్లో రాష్ట్రస్థాయి వాలీబాల్‌ టోర్నీ

నిజామాబాద్‌నాగారం: ముఖ్యమంత్రి కేసీఆర్‌ పుట్టిన రోజు పురస్కరించుకొని తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఈ నెల 15, 16 తేదీల్లో రాష్ట్రస్థాయి వాలీబాల్‌ టోర్నీ నిర్వహిస్తున్నట్లు జిల్లా కన్వీనర్‌ అవంతి తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జాగృతి కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 15, 16 తేదీల్లో హైదరాబాద్‌లోని లాల్‌బహదూర్‌ స్టేడియంలో మహిళలకు, పురుషులకు టోర్నీ ఉంటుందన్నారు. ప్రథమ బహుమతి రూ.లక్ష, ద్వితీయ బహుమతి రూ.50 వేలు, తృతీయ బహుమతి రూ.25వేలు అని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న జిల్లా క్రీడాకారులు హైదరాబాద్‌కు వెళ్లాలన్నారు. జిల్లా వాలీబాల్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు హనుమంత్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్‌, లక్ష్మీనారాయణ భరద్వాజ్‌, సుధాకర్‌, సాయికృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాగృతి జిల్లా కన్వీనర్‌ అవంతి

క్రైం కార్నర్‌

మహిళ బ్యాగులోంచి బంగారం చోరీ

- కామారెడ్డి బస్టాండ్‌లో ఘటన

కామారెడ్డి క్రైం: మహిళ బ్యాగులోంచి రెండు తులాల బంగారు ఆభరణాలను చోరీకి గురైన ఘటన కామారెడ్డి కొత్త బస్టాండ్‌లో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. భిక్కనూరు మండలం లక్ష్మీదేవునిపల్లి గ్రామానికి చెందిన మధువాణి గతంలో జిల్లా కేంద్రంలోని ముత్తూట్‌ ఫైనాన్స్‌లో బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టి డబ్బు తీసుకున్నారు. సోమవారం ఫైనాన్స్‌కు వెళ్లి బంగారు ఆభరణాలు విడిపించుకుని స్వగ్రామానికి వెళ్లడానికి కొత్త బస్టాండ్‌కు వచ్చింది. బస్సు కోసం వేచి ఉండగా దొంగలు బంగారు ఆభరణాలను కాజేశారు. కొద్ది సేపటికి హ్యాండ్‌ బ్యాగ్‌ తెరిచి చూసేసరికి బ్యాగులో ఉంచిన రెండు తులాల బంగారం కనిపించలేదు. చోరీ జరిగినట్లు గుర్తించిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బాధితురాలు

నగరంలో వృద్ధుడు అదృశ్యం

ఖలీల్‌వాడి: నగరంలోని సూర్యనగర్‌లో నివాసం ఉండే వసంత విద్యాసాగర్‌(67) కనబడటం లేదని ఆయన కుమారుడు సురేశ్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆదివారం ఉదయం 6 గంటలకు ఇంట్లో నుంచి వెళ్లిన విద్యాసాగర్‌ తిరిగి ఇంటికి రాలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నాలుగో టౌన్‌ ఎస్సై సందీప్‌ తెలిపారు.



విద్యాసాగర్‌

లింగంపేటకు చెందిన మహిళ..

లింగంపేట: లింగంపేటకు చెందిన ధారావత్‌ సునీత అదృశ్యమైనట్లు ఎస్సై శంకర్‌ తెలిపారు. సునీత లింగంపేట నుంచి ప్రతీ రోజు కూలీ పని కోసం కామారెడ్డి వెళ్లి వస్తుండేది. డిసెంబర్‌ 28న కూలీ పనుల కోసం కామారెడ్డికి వెళ్లింది. ఆ రోజు రాత్రి అయినా ఇంటికి రాలేదు. తండ్రి రాములు పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

కామారెడ్డి క్రైం: కడుపు నొప్పి కారణంగా జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి పురుగు మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన కామారెడ్డి మున్సిపల్‌ పరిధిలోని టేక్రియాల్‌ గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మేడుదుల రాజయ్య (39) మొదటి భార్య ఎనిమిది సంవత్సరాల క్రితం చనిపోయింది. ఏడేళ్ల క్రితం బశవ్వను రెండో వివాహం చేసుకున్నాడు. రెండేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఎన్ని ఆస్పత్రుల్లో చూపించుకున్నా తగ్గలేదు. దీంతో కొద్దిరోజులుగా మానసిక వేదనకు గురయ్యేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈనెల 11న ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతడు తిరిగి రాలేదు. సాయంత్రం సమయంలో బశవ్వ ఫోన్‌ చేయగా తాను సమీపంలోని ఓ ఆలయం దగ్గర పురుగు మందు తాగి పడిపోయినట్లు చెప్పాడు. కుటుంబ సభ్యులు వెంటనే అక్కడికి వెళ్లి రాజయ్యను ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడనుంచి మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ సోమవారం వేకువజామున మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు దేవునిపల్లి ఎస్సై ప్రసాద్‌ తెలిపారు.

పోతున్నూర్‌కు చెందిన ఒకరు..

సిరికొండ: మండలంలోని పోతున్నూర్‌ గ్రామానికి చెందిన పెద్దోల్ల గంగాధర్‌(55) చికిత్స పొందుతు మృతి చెందినట్లు ఎస్సై నర్సింలు తెలిపారు. గంగాధర్‌ శనివారం రాత్రి పురుగుల మందు తాగగా కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతు ఆదివారం మృతి చెందాడని ఎస్సై సోమవారం తెలిపారు. మృతుడి భార్య సుశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి

సుభాష్‌నగర్‌: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ పెండింగ్‌లో ఉన్న అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 87 ఫిర్యాదులు అందాయి. కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, చంద్రశేఖర్‌, జెడ్పీ సీఈవో గోవింద్‌, డీఆర్‌డీఓ చందర్‌ నాయక్‌ వినతులు స్వీకరించారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు

వెల్‌నెస్‌ సెంటర్‌ను మార్చాలని వినతి

వెల్‌నెస్‌ సెంటర్‌ను అన్ని సౌకర్యాలు ఉన్న భవనంలోకి తక్షణమే మార్చాలని తెలంగాణ ఆల్‌ పెన్షనర్స్‌, రిటైర్డ్‌ పర్సన్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ప్రజావాణిలో విన్నవించారు. నగరంలోని జీజీహెచ్‌లో నాలుగో అంతస్తులో ఉండటంతో రిటైర్డ్‌ ఉద్యోగులు అవస్థలు పడుతున్నారని, ఆస్పత్రి వెనుక భాగంలో ఉన్న నర్సింగ్‌ కళాశాల, మెప్మా భవనాలు అనుకూలంగా ఉన్నాయని వివరించారు. జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌రావు, ప్రధానకార్యదర్శి ఎస్‌ మదన్‌మోహన్‌, దత్తాత్రేయరావు, ఈవీఎల్‌ నారాయణ, సుదర్శన్‌ రాజ్‌, జార్జ్‌ ఉన్నారు.

సేవాలాల్‌ జయంతిని సెలవుదినంగా ప్రకటించాలి

బంజారాల ఆరాధ్యదైవం సంత్‌ శ్రీ సేవాలాల్‌ మహారాజ్‌ జయంతి సందర్భంగా ఫిబ్రవరి 15న సెలవుదినంగా ప్రకటించాలని లంబాడీల ఐక్య వేదిక నాయకులు వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు కాట్రోత్‌ రవీందర్‌ నాయక్‌, జిల్లా ఇన్‌చార్జి మాలోత్‌ విఠల్‌ నాయక్‌, అశోక్‌ వర్మ నాయక్‌ పాల్గొన్నారు.

పేదల పట్టా భూములకు పరిష్కారం చూపాలి

సిరికొండ మండలంలోని 532, గడ్కోల్‌లో 100 సర్వే నంబర్‌లో పేదలకు ఇచ్చిన పట్టా భూములకు ఫారెస్ట్‌ అధికారుల అడ్డంకులు తొలగించి పరిష్కారం చూపాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి ప్రభాకర్‌ డిమాండ్‌చేశారు.పి రామకృష్ణ,దేవారాం, గుమ్ముల గంగాధర్‌, బాబన్న, అనీష్‌ పాల్గొన్నారు.

పేదలకు భూమి పంచాలని వినతి

నిజామాబాద్‌రూరల్‌ మండలం మల్కాపూర్‌ (ఎ), లక్ష్మాపూర్‌(ఎ) గ్రామాల్లోని సర్వేనెంబర్‌ 339లో గల అసైన్డ్‌ భూమిని పేద కుటుంబాలకు పంపిణీ చేయాలని బీఎస్‌పీ ఆధ్వర్యంలో గ్రామస్తులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ ఆ భూమి లో ఏళ్లుగా పంటలు పండించుకుంటున్నామని తెలిపారు. ఇటీవల కొందరు భూమిని కబ్జా చేస్తున్నారని, గోదాములు కడుతున్నారని ఆరోపించారు.

న్యాయం చేయాలని విన్నపం

ఆర్మూర్‌కు చెందిన లక్కీ డ్రా కంపెనీలకు ఏజెంట్ల ద్వారా ప్రతినెల రూ.వెయ్యి చొప్పున 16 నెలలు చెల్లించామని, బహుమతులు ఇచ్చే సమయానికి రేపు.. మాపు అంటూ కాలయాపన చేస్తున్నారని ఇందల్వాయి మండలంలోని ఎల్లారెడ్డిపల్లికి చెందిన బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఆర్మూర్‌ పోలీస్‌స్టేషన్‌లో కేసులు పెట్టామని, పోలీసుల నుంచి కూడా ఎలాంటి స్పందన లేదన్నారు. తమ డబ్బులు ఇప్పించి, న్యాయం చేయాలని వారు కోరారు.

ఎఫ్‌పీవోలకు సంపూర్ణ సహకారం



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్‌

డిచ్‌పల్లి: రైతుల సర్వతోముఖాభివృద్ధికి రైతు ఉత్పత్తిదారుల సంఘం (ఎఫ్‌పీవో) కృషి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్‌ సూచించారు. డిచ్‌పల్లిలోని కేఎస్‌ఆర్‌ గార్డెన్స్‌లో ఇందూరు డిచ్‌పల్లి రైతు ఉత్పత్తిదారుల సంఘం కంపెనీ లిమిటెడ్‌ చైర్మన్‌ మచ్చర్ల నాగయ్య అధ్యక్షతన సోమవారం ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎఫ్‌పీవోలకు వ్యవసాయ శాఖ తరఫున సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. ఎఫ్‌పీవోలు ఏర్పాటు చేసుకుని అందులో సభ్యులుగా చేరడంతో వ్యవసాయంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను రైతులు అధిగమించి, ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. ఎరువులు, పురుగు మందుల అమ్మకాలు, కోల్డ్‌ స్టోరేజీలు, సీడ్‌ ప్రాసెసింగ్‌ యూనిట్ల ఏర్పాటుతో పాటు ఎఫ్‌పీవోలు మరింత కొత్త ఆలోచనలతో ముందుకు సాగాలని సూచించారు. అలాగే ఎరువులు, విత్తనాల అమ్మకాల కోసం అవసరమైన లైసెన్స్‌ల జారీ అంశంలో జిల్లా వ్యవసాయ శాఖ పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. మంచి కంపెనీలతో భాగస్వామ్యం కుదుర్చుకుని లాభాలు సాధించాలన్నారు. రైతులు ఒకే పంటను సాగు చేయకుండా పంటమార్పిడి విధానం అలవాటు చేసుకోవాలన్నారు. అవసరమైన మేరకే యూరియా వాడాలన్నారు. ఈ సమావేశంలో కంపెనీ మేనేజింగ్‌ డైరెక్టర్‌ కొండెల సాయరెడ్డి, డైరెక్టర్లు వేల్పూర్‌ భూమయ్య, ఆకుల పాపయ్య, జంగం భూమయ్య, కూచన్‌పల్లి స్రవంతి, కూచనకోట అఖిల, కదం పెంటయ్య, టీఎస్‌రెడ్డి, శ్రీకాంత్‌, నాప్కాన్‌ జిల్లా అధికారి థామస్‌ మోడీ, వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న రైతులు

కొడుకు, మనవడు కొడుతున్నారు

- సీపీకి ఫిర్యాదు చేసిన వృద్ధురాలు

నిజామాబాద్‌నాగారం: తన కొడుకు, మనవడు మానసికంగా ఇబ్బందులు పెట్టుతూ, కొడుతున్నారని నగరంలోని శివాజీనగర్‌ కాలనీ చెందిన సిర్ప గంగమణి సోమవారం సీపీ నాగరాజుకు ఫిర్యాదు చేసింది. ఇంట్లో ఉండనివ్వడం లేదని, పెన్షన్‌ డబ్బులు తీసుకుంటున్నారని వాపోయింది. తనకు న్యాయం చేయాలని వేడుకుంది. స్పందించిన సీపీ చర్యలు తీసుకోవాలని ఏసీపీని ఆదేశించారు.



రోదిస్తున్న గంగమణి

కొనసాగుతున్న టీసీసీ పరీక్షలు

నిజామాబాద్‌అర్బన్‌: నిజామాబాద్‌ నగరంలో టెక్నికల్‌ సర్టిఫికెట్‌ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం 246 మంది పరీక్షకు హాజరయ్యారు. మానిక్‌భవన్‌, కోటగల్లీ, శంకర్‌భవన్‌ పాఠశాలల్లో పరీక్షలు జరుగుతున్నాయి. మంగళవారంతో పరీక్షలు ముగియనున్నాయి.

జల్సాలకు అలవాటు పడి చోరీలు

- నిందితులను అరెస్ట్‌ చేసిన పోలీసులు

జక్రాన్‌పల్లి: జల్సాలకు అలవాటు పడి చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామ పరిధిలోని గాంధీనగర్‌లో ఈ నెల 6న మహిళ మెడలో నుంచి రెండున్నర తులాల బంగారు గొలుసు అపహరించిన నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు డిచ్‌పల్లి సీఐ మోహన్‌, జక్రాన్‌పల్లి ఎస్సై శ్రీకాంత్‌ తెలిపారు. సోమవారం జక్రాన్‌పల్లి పోలీస్‌ స్టేషన్‌లో నిందితుల వివరాలను సీఐ వెల్లడించారు. వేల్పూర్‌కు చెందిన షేక్‌ సమీర్‌, మహమ్మద్‌ ముజామిల్‌ జల్సాలకు అలవాటు పడ్డారు. తొందరగా డబ్బులు సంపాదించాలని ఈ నెల 6న గాంధీనగర్‌లో ఆక్స్‌ఫర్డ్‌ స్కూల్‌ పక్కన నేరేడు పళ్లను అమ్ముతున్న మహిళ మెడలో నుంచి రెండున్నర తులాల బంగారు పుస్తెలతాడును లాక్కొని పారిపోయారు. చుట్టు పక్కల గ్రామాల్లో సీసీ కెమెరాలను పరిశీలించి నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. నిందితుల నుంచి రెండున్నర తులాల బంగారంతో పాటు రెండు సెల్‌ ఫోన్లు ఒక బైక్‌ స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

నీళ్లలోని మోటారు తీయబోయి మృత్యువాత

మాచారెడ్డి: నీటిలో మునిగిన విద్యుత్‌ మోటారును పైకి తీసే క్రమంలో నీట మునిగి ఒకరు మృతిచెందారు. మండలంలోని పాల్వంచ వాగులో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలు.. లక్ష్మిరావులపల్లి గ్రామానికి చెందిన తోకల సత్యం (35)తోపాటు మరో ఇద్దరు పాల్వంచ గ్రామానికి చెందిన ఓ రైతు మోటారు నీట మునగగా తీయడానికి వెళ్లారు. ఈ ప్రయత్నంలో నీట మునిగిన సత్యం పైకి రాకపోవడంతో అనుమానం వచ్చి నీటిలో వెదికారు. బయటకు తీసి చూసేవరికి సత్యం చనిపోయాడు. మృతుడికి భార్య, రెండేళ్ల కుమారుడు ఉన్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

మాక్లూర్‌: ప్రసవం కోసం పుట్టింటికి వెళ్లిన భార్య తిరిగి రావడం లేదని మనస్తాపం చెంది ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. మండలంలోని ధర్మోరా గ్రామానికి చెందిన ఈర్నాల రమేశ్‌(29) పీవోపీ పనులు చేస్తూ జీవిస్తాడు. ఆయనకు ఏడాది క్రితం వివాహం అయింది. భార్య గర్భవతి కావడంతో పుట్టింటి వారు ప్రసవం కోసం తీసుకెళ్లారు. రమేశ్‌ భార్యను తరుచూ తన వద్దకు రమ్మనేవాడు. అయితే అందుకు భార్య తల్లిదండ్రులు ఒప్పుకోకపోవడంతో మనస్తాపం చెందిన రమేశ్‌ గ్రామ శివారులోని ఓ చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని చెప్పారు.